



ఆనందమానందమాయె



ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న నిరుద్యోగులు నోటిఫికేషన్ విడుదలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లకు తమ కల నెరవేరే రోజులు వస్తున్నందుకు ఆనందపడుతున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. మెగా డీఎస్సీకి ఆదివారం ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో ప్రభుత్వం, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో కలిపి 373 పోస్టులు, మున్సిపల్ పాఠశాలల్లో 73 పోస్టులు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 137 పోస్టుల భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జూన్ 6 నుంచి నెల రోజుల పాటు పరీక్ష జరుగుతుంది. విద్యా సంవత్సరం మొదలయ్యేలోగా ఉపాధ్యాయుల నియామకం పూర్తికానుంది.

- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై నిరుద్యోగుల్లో హర్షం
- ఉమ్మడి జిల్లాలో భర్తీకానున్న 583 పోస్టులు
- జూన్ 6 నుంచి నెల రోజుల పాటు పరీక్ష
- విద్యా సంవత్సరం మొదలయ్యేలోగా ఉపాధ్యాయుల నియామకం

కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలతో అభ్యర్థులు పట్టరాని ఆనందంలో ఉన్నారు. ఇన్నేళ్ల తమ ప్రయత్నానికి ఓ దారి కనిపించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం పూర్తిగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. అభ్యర్థుల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో (మిగతా 8వ పేజీలో..)

జిల్లాలో భర్తీ వివరాలు ఇలా..

కేటగిరి	పోస్టులు సంఖ్య	గిరిజన ఆశ్రమ స్కూల్స్	మున్సిపల్ స్కూల్స్
ఎస్ఏ తెలుగు (అసిస్టెంటు)	12	00	02
హిందీ	14	00	00
ఇంగ్లీసు	19	07	04
గణితం	8	25	00
ఫిజిక్స్	32	24	00
బయోలజీ	19	16	01
సోషల్	58	05	04
పీఈ	62	00	01
ఎస్‌జిటీ	149	60	61
మొత్తం	373	137	73



గడువు పెంచాలి



డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఆనందంగా ఉంది. ఉపాధ్యాయ ఉద్యోగం కోసం చాలా రోజుల నుంచి చదువుతున్నాను. స్థానిక గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలన్నీ ఉండడంతో రోజూ అక్కడకు వెళ్లి చదువుతున్నాను. అయితే ఇంత తక్కువ సమయంలో సిలబస్‌ను పూర్తిచేయడం సాధ్యం కాదు. టెట్‌కు ఇచ్చినట్లే ఉపాధ్యాయ నియామక పరీక్షకు గడువు పెంచాలి

-ఎలమంచిలి దివ్య (డీఎడ్), ఎస్.కోట

కొలువు సాధిస్తా..



కొన్నేళ్లుగా డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నా. కచ్చితంగా ఉపాధ్యాయ కొలువు కొడతానన్న నమ్మకం ఉంది. గత ఐదేళ్లలో ఏటా డీఎస్సీ అన్నారు. ఒక్కసారి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఇప్పుడు 16,347 పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడం బాగుంది. సమయం తక్కువగా ఉంది.

-సిద్ధాంతం మన్మథరావు, డీఎస్సీ అభ్యర్థి, రాజాం

మంచి అవకాశం..



సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ జారీ వేసి నిరుద్యోగులకు ఊరట ఇచ్చారు. నిరుద్యోగులకు ఇది మంచి అవకాశం. పరీక్షల నిర్వహణ మరో రెండు నెలలు వాయిదా వేస్తే బాగుంటుంది.

-జగ్గినేని వెంకునాయుడు, జరజాపుపేట, నెల్లిమర్ల మండలం

కోరిక ఫలించింది..



నేను డీఎస్సీ కోసం కొన్నేళ్లుగా చదువుతున్నాను. నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూశాను. ఇప్పటికి నా కోరిక ఫలించింది. మంత్రి లోకేశ్ గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. బొబ్బిలి పార్కుకు వెళ్లి చదువుకుంటున్నాను. ఇంకొంచెం సమయం కావాలి.

-ఆర్.అజయ్, సిరుగుడు వీధి, బొబ్బిలి

పండుగలా చంద్రన్న పుట్టినరోజు

- సీఎం జన్మదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్న టీడీపీ శ్రేణులు, అభిమానులు
- జిల్లా అంతటా కేక్ కటింగ్‌లు.. సేవా కార్యక్రమాలు
- పాల్గొన్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు
- ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు





టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, (ఇన్‌సెట్)లో మొక్క నాటుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజును జిల్లాలోని ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఓ పండుగలా జరుపుకున్నారు. భారీ కేక్‌లు కట్ చేశారు. రక్తదానాలు చేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేపట్టారు. రోజంతా సందడి చేశారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అధ్యక్షతన జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ముస్లింలు, మైనార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● పైడిమాంబ ఆలయంలో చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చదురుగుడి ఎదుట 101 కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.



రక్తదానం చేస్తున్న మంత్రి శ్రీనివాస్

విజనరీ ఉన్న నాయకుడు : మంత్రి

గజపతినగరం, ఏప్రిల్20:(ఆంధ్రజ్యోతి) రాష్ట్రానికి విజనరీ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సీఎం పుట్టిన రోజు పురస్కరించుకొని గజపతినగరంలోని టీడీపీ కార్యాయలంలో ఆదివారం కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు చల్లగా నిండు నూరేళ్లు జీవించాలని, ఆయన మార్గనిర్దేశంతో ప్రజల బంగారు భవిష్యత్ కోసం మనందరం కలిసి పని చేయాలని సూచించారు. రక్తదాన శిబిరానికి యువత అధికంగా ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రక్తదానం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాలరాజు, మాజీ జడ్పీటీసీ ఎం.శ్రీధర్ కూడా రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కొండపల్లి కొండలరావు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జాప్యమెందుకో?

- నేటికీ విడుదల కాని దక్షిణ కోస్తా రైల్వేజోన్ నోటిఫికేషన్
- కొత్తవలస రైల్వే స్టేషన్ అడ్డంకి అయ్యిందా!



కొత్తవలస రైల్వేస్టేషన్


కొత్తవలస, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి)

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వేజోన్ గజిట్ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం జరుగుతోంది. దీనికి ప్రధాన కారణం కొత్తవలస రైల్వేస్టేషన్ అని తెలుస్తోంది. తూర్పు కోస్తా రైల్వే జోన్ అధికారులు కొత్తవలస స్టేషన్‌ను కోరుతున్నట్లు సమాచారం. దీనిని జిల్లా వాసులు తిప్పికొడుతున్నారు. ఈ పరిస్థితిలో రైల్వే అధికారులు ఎటూ తేల్చడం లేదు.

వాస్తవానికి విశాఖరైల్వే జోన్ ప్రకటించిన తరువాత కార్యాలయం ఏర్పాటుకు శంఖుస్థాపన కూడా చేశారు. జోన్ ఏర్పాటుకు ముందు గజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలి. ఇంతవరకు జారీ కాలేదు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తాజోన్ ఏర్పాటు చేసిన తరువాత వాల్తేరు డివిజన్‌తో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన రాయగడను డివిజన్‌గా ఏర్పాటు చేశారు. అయితే రాయగడ తూర్పు కోస్తా జోన్‌లో ఉంటుంది. కొత్తవలస రైల్వే స్టేషన్ నుంచి అరుకు వరకు మధ్యలో ఉన్న అన్ని రైల్వేస్టేషన్లు రాయగడ డివిజన్‌లో చేర్చారు. అయితే కొత్తవలస రైల్వే స్టేషన్‌ను వాల్తేరు డివిజన్‌లో ఉంచాలని స్థానికులు పట్టుబడుతుండగా భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు కాస్తా నుంచి కొత్తవలస రైల్వే స్టేషన్ తమకే కావాలని వత్తిడి చేస్తున్నారు. ఈ పరిస్థితిలో కొత్తవలస రైల్వేస్టేషన్‌కు సంబంధించి రైల్వేశాఖ ఎటూ తేల్చుకోలేకపోతోంది. దీంతోనే దక్షిణ కోస్తా జోన్ గజిట్ నోటిఫికేషన్ రావడం ఆలస్యమవుతోందని సమాచారం. కొత్తవలస రైల్వేస్టేషన్‌ను కోరడంపై తూర్పు కోస్తా జోన్ అధికారుల్లో బలమైన ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది. కొత్తవలస రైల్వేస్టేషన్ పరిధిలో (మిగతా 8వ పేజీలో..)

మత్స్యకార భృతి పంపిణీకి సన్నాహాలు

- 26న ఖాతాల్లో జమ
- జిల్లాలో 4087 దరఖాస్తులు రాక



ముక్కాం తీరంలో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

భోగాపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో ఉపాధికి దూరమైన మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రకటించిన మత్స్యకార భృతి పంపిణీకి సన్నాహాలు జరుగుతున్నాయి. అర్హులకు ఈనెల 26న బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమ కానుంది. వారికి అందించే భృతిని ఈ ప్రభుత్వం రెట్టింపు చేసిన విషయం తెలిసిందే. ఆ లెక్కన అర్హులందరికీ రూ.20వేలు చొప్పున అందనుంది. కాగా గత వైసీపీ ప్రభుత్వంలో అర్హులైన మత్స్యకారులందరికీ పరిహారం అందలేదు. అప్పట్లో అందిన సాయం కూడా రూ.10వేలు మాత్రమే. మత్స్యకార భృతికి అర్హులను గుర్తించేందుకు ఈ ప్రభుత్వం ఈ నెల 18న దరఖాస్తులు స్వీకరించింది. పూసపాటిరేగ మండలానికి సంబంధించి 2536 మంది, భోగాపురం మండలం నుంచి 1551 మంది దరఖాస్తులు ఇచ్చారు. అదే రోజు దరఖాస్తుదారులకు సంబంధించిన పడవలకు ఫొటోలు తీశారు. వారి వివరాలన్నీ సేకరించారు. అయితే దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాతే ప్రభుత్వం నుంచి మత్స్యకార భరోసా జాబితా విడుదల కానుంది. అర్హులైన మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో రూ.20 వేలు చొప్పున ప్రభుత్వం జమచేయనుంది. ప్రస్తుతం దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడానికి ప్రయత్నిస్తున్న అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వెబ్‌సైట్ సరిగా ఓపెన్ కావడం లేదు. దీనిపై మత్స్యశాఖ ఎఫ్‌డీవో చాందినిని వివరణ కోరగా మత్స్యకారులనుంచి దరఖాస్తులు స్వీకరించి పడవలకు ఫొటోలు కూడా తీసి సిద్ధంగా ఉన్నామని, రెండు మండలాలకు సంబంధించి 4087 దరఖాస్తులు అందాయని, వీటన్నింటినీ ఆన్‌లైన్ చేయనున్నామన్నారు. ఆ తరువాత అర్హుల జాబితా వెలువడనుందని తెలిపారు.

40 గ్రామాల్లో సర్వే

- హెచ్‌పీసీఎల్ పైపులైన్ ఏర్పాటుకు సన్నాహాలు

గరుగుబిల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ పైపులైన్ల ఏర్పాటుకు పార్వతీపురం మన్యం జిల్లాలో ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. విశాఖ నుంచి ఒడిశా, రాయపూర్ ప్రాంతాలకు అవసరమైన పెట్రోల్ సరఫరాకు గాను పైపులైన్లు వేయనున్నారు. ఈ మేరకు కొమరాడ మండలం కొరిశీల నుంచి బలిజిపేట మండలం సుభద్ర వరకు ఉన్న 40 గ్రామాల పరిధిలో కార్పొరేషన్ సిబ్బంది సర్వే చేస్తున్నారు. సంబంధిత భూములకు ప్రభుత్వం గెజిట్ రూపొందించింది. రైతుల భూముల్లో ఏడడుగులు మేర తవ్వకాలు చేపట్టి పైపులైన్లు ఏర్పాటు చేయనున్నారు. భూగర్భంలో నుంచే సరఫరా అయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జాయింట్ మెజర్‌మెంట్ సర్వే (జేఎంఎస్) నిర్వహిస్తున్నారు. జేఎంఎస్ సర్వేకు ముందు రైతులకు 3-1 నోటీసులను అందిస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత 6-1 నోటీసును అందించనున్నారు. పైపులైన్‌కు అవసరమైన భూసేకరణకు గాను రైతులకు తగిన పరిహారం అందిస్తామని సర్వేయర్ కె.అప్పన్న తెలిపారు. ఈ భూసేకరణను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షిస్తాని వెల్లడించారు. సేకరించిన భూములు, సర్వే నెంబరు, సబ్ డివిజన్లను తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పరిశీలిస్తారని తెలిపారు. కాగా ఈ సర్వే త్వరలో విజయనగరం జిల్లాలో కూడా జరగనుంది.

7

కొడుకు అల్లరి భరించలేక..

- చీమల మందు తాగి మహిళ ఆత్మహత్య

నేడు ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి పరీక్ష



పెదమానాపురం చర్చిలో కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్‌ను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. విజయనగరంలో కోట జంక్షన్ నుంచి మూడులాంతర్లు, గంటస్తంభం, రైల్వే స్టేషన్ వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం ఆర్‌సీఎం చర్చిలో అత్యధికంగా పాల్గొని కొవ్వొత్తులతో ప్రార్థనలు చేశారు. చెడుపై మంచికి జరిగిన విజయానికి గుర్తుగా ఈస్టర్ జరుపుకుంటామని చర్చిఫాదర్ సాగరబాబు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది క్రైస్తవులు వచ్చి రొట్టెలు పంచుకొని బాణసంచా వెలిగించారు.



విజయనగరంలో క్రైస్తవుల ర్యాలీ

కృష్ణాపురం రోడ్డుకు రూ.కోటి

● నిధులు కేటాయించిన వీఎంఆర్‌డీఏ ● ఎమ్మెల్యే లలితకుమారి కృషి ఫలితమే..

శృంగవరపుకోట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కృషి ఫలించింది. మండల పరిధిలోని కృష్ణాపురం బీటీ రోడ్డు పునఃనిర్మాణానికి వీఎంఆర్‌డీఏ (విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) రూ.కోటి కేటాయించింది. ఇందుకు సంబంధించి మెట్రోపాలిటన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. తాటిపూడి రిజర్వాయర్ నుంచి విశాఖ మహానగరంనకు తాగునీటి సరఫరా జరుగుతున్న విషయం తెలిసిందే. కృష్ణాపురం వద్ద తాగునీటి శుద్ధి జరుగుతుంది. అక్కడకు వెళ్లేందుకు ఇటు ఎస్.కోట- విజయనగరం రోడ్డు నుంచి, ఆటు బొడ్డవర-తాడిపూడి రోడ్డు నుంచి ఈ గ్రామానికి ప్రత్యేకంగా విశాఖపట్టణం నగరపాలక సంస్థ ప్రత్యేక రోడ్డును నిర్మించింది. దీన్నే ట్యాంకుల లైన్‌గా పిలుస్తారు. ఈ రోడ్డుకు అనుకుని గంట్యాడ మండలం తాటిపూడి, మధుపాడ, ఎస్.కోట మండలం ముషిడిపల్లి, భీమవరం, కృష్ణాపురం గ్రామాలున్నాయి. మరికొన్ని గ్రామాలకు ఈ రోడ్డే గతి. అయితే అప్పుడప్పుడు వచ్చిపోయే విశాఖ మహానగర అధికారులు ఈ రోడ్డును పట్టించుకోలేదు. దీంతో స్థానికులు ఆందోళనలు చేపట్టడంతో కొన్నేళ్ల కిందట రోడ్డు బీటీగా మార్చారు. ఆ తర్వాత దాని నిర్వహణకు వదిలేశారు. దాంతో రోడ్డు అధ్వానంగా మారింది. ఈ సమస్యపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి.. సీఎం చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి నారాయణలకు వివరించారు. దాంతో వీఎంఆర్‌డీఏస్ అధికారులు రోడ్డు పునఃనిర్మాణానికి ముందుకు వచ్చారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


అధ్వానంగా కృష్ణాపురం రోడ్డు

నేడు ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి పరీక్ష

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలోని 15 కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా 3105 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్షకేంద్రాలకు హాజరు కావాలని డీఈవో మాణిక్యం నాయుడు సూచించారు.

22న జలవనరుల శాఖ మంత్రి జిల్లాకు రాక

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు 22న జిల్లాలో పర్యటించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాకు చేరుకుని నెల్లిమర్ల మండలంలోని తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టు పనులను పరిశీలించనున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రాజెకు పనులు, పునరావాసం తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

భోగాపురం సీఐ బదిలీ

భోగాపురం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): భోగాపురం సీఐ ఎన్వీ ప్రభాకర్‌కు ఆదివారం విశాఖ సిటీకి బదిలీ అయింది, అయితే ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

విభేదాలు సృష్టిస్తే సహించం

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకార సంఘంలో విభేదాలు సృష్టిస్తే సహించమని జిల్లా స్వర్ణకార సంఘం ప్రతినిధి జానా ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం రెవెన్యూ హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్వర్ణకార సంఘం కార్యవర్గాన్ని జిల్లాకు చెందిన ప్రతినిధులకు సంబంధం లేకుండా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సమావేశం ఏర్పాటు చేయకుండా ఇష్టానురీతిన ఒక వ్యక్తికి పదవి ఇవ్వడం అప్పగించడం తగదన్నారు. ఇటువంటి నిర్ణయాలు జిల్లా స్వర్ణకార సంఘం మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కణపాకలోని నవజీవన్ శాఖలో ఆదివారం 35 మంది పేద మహిళలకు నిత్యావసర సరుకులను ఆ సంస్థ అధ్యక్షుడు బీకే శ్రీధర్ ఆచార్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఎదలకు నిత్యావసర సరుకులు అందజేయడమే కాకుండా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజరు ఎస్‌వీ రమణ, అమ్మ సేవా సొసైటీ మేనేజరు పురుషోత్తం, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాగెమ్మపేట రోడ్డు పనుల ప్రారంభం

వంగర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాగెమ్మపేట రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పనులకు శ్రీకారం చుట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న డెంకాడ మండలం పెదతాటివాడకు చెందిన అథ్లెట్, కోచ్ టి.అప్పారావుకు మదర్ థెరీసా సేవాసంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ప్రతినిధులు ఆర్థిక సాయం చేశారు. త్యాడ ప్రసాద్ పట్నాయక్, మాలతీ ఆయన నివాసానికి వెళ్లి రూ.18,500 అందజేశారు. భవిష్యత్తులోనూ అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

చలివేంద్రాల ఏర్పాటు సామాజిక బాధ్యత

నెల్లిమర్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) వేసవి కాలంలో చలివేంద్రాల ఏర్పాటు సామాజిక బాధ్యత అని టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. ఆనంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సీతారామునిపేట జంక్షన్‌లో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రవిశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల రాజారావు, గురాన చక్రధర్,కోటపాటి తిరుపతిరావు,తాడ్డి సత్యనారాయణ, రెడ్డి వేణు, దన్నాన శ్రీరామ్, గొర్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'రన్ ఫర్ జీసెస్'

వేపాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాదిలో బ్యూలా బ్లెస్సింగ్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం రన్ ఫర్ జీసెస్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో బానాది, బల్లంకి, ఎం.సింగవరం తదితర గ్రామాలకు చెందిన బ్యూలా బ్లెస్సింగ్ చర్చి విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.50వేల ప్రోత్సాహకం అందజేత

భోగాపురం, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): మూడో ఆడబిడ్డకు జన్మనిచ్చిన మండలంలోని సవరవల్లికి చెందిన పోలిపల్లి దివ్య, సురేష్ దంపతులకు కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆదివారం రూ.50వేలు ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం సందర్భంగా జిల్లాలో మూడో ఆడబిడ్డకు జన్మనిచ్చిన దంపతులకు నిఖిల ట్రస్టు ద్వారా రూ.50 వేలు అందజేస్తామని మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ ప్రభునాయుడు, డీఎంహెచ్‌వో జీవనరాణి, పీహెచ్‌సీ వైద్యులు డా.దివ్య, డా.స్రవంతి పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి

టీడీపీలో 20 కుటుంబాల చేరిక

గంట్యాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంత గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బల్లంకి కృష్ణ, మేరి, మారపూడి జగదీశ్, పిల్లి రమేష్, భార్గవ్, కణితి జాన్, కణితి కిశోర్‌తో పాటు పాటు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండపల్లి కొండలరావు, కొండపల్లి భాస్కర్‌నాయుడు, అల్లు విజయకుమార్, పోలినాయుడు, సున్నపు రామస్వామి తదితరులు ఉన్నారు.


పార్టీలో చేరిన వారితో మంత్రి శ్రీనివాస్

నిరుద్యోగుల్లో నూతన ఆనందోత్సాహం: మంత్రి

గజపతినగరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ కొలువుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో ఆనందోత్సాహం వెల్లువెత్తుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందదాయకమన్నారు. కాగా అభ్యర్థులకు 42 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు అదనంగా రెండేళ్లు పెంచారని మంత్రి వివరించారు.

బొత్సను కలిసిన పోటీల నిర్వాహకులు

గరివిడి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఆదివారం గరివిడిలోని క్యాంపు కార్యాలయంలో గరివిడిలోని నాటక పోటీల నిర్వాహకులు కలిశారు. మే 9, 10, 11 తేదీల్లో గరివిడిలో ఉభయ రాష్ట్రాల నాటకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా నాటక పోటీలకు ఆహ్వానించారు. బొత్సను కలిసిన వారిలో నిర్వాహకులు ఉప శ్రీను, వాకాడ శ్రీను, కుమార్, బమ్మిడి కార్తీక్ తదితరులు ఉన్నారు.


బొత్సతో మాట్లాడుతున్న పోటీల నిర్వాహకులు

రెవెన్యూ సర్వీసెస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

బొండపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా బొండపల్లి తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



రాజేశ్వరరావును అభినందిస్తున్న సభ్యులు

మృతుడి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా

బొండపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చందకపేటకు చెందిన టీడీపీ కార్యకర్త వెలుగుల లవ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబానికి టీడీపీ రూ.5 లక్షల బీమాను మంజూరు చేసింది. ఆదివారం సంబంధిత చెక్కును మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. మృతుడి భార్య చైతన్యలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ కృష్ణ, నాయకులు నంబూరి రాజేష్, పి.శ్రీనివాసరావు, కొండపల్లి భాస్కరనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ అభివృద్ధి పనుల నేపథ్యంలో సోమవారం మండలంలోని మోపాడ, జగన్నాథపురం, వల్లూరు, మోదవలసల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అనుమానాస్పద వ్యక్తుల ఆచూకీ కనిపెట్టేందుకు శనివారం రాత్రి లాడ్జిలు, హోటళ్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతి భద్రతలు పరిరక్షించడం, అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణే లక్ష్యంగా జిల్లాలోని వన్‌టౌన్, టూటౌన్, కొత్తవలస, ఎస్‌కోట, గజపతినగరం, బొబ్బిలి, రామభద్రాపురం, చీపురుపల్లి తదితర పోలీసుస్టేషన్ల పరిధిలో 72 లాడ్జిలు, హోటల్స్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. లాడ్జిలో బసచేస్తున్న వ్యక్తుల వివరాలను, ఆధార్, గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ లాడ్జిల్లో ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే సమాచారం అందివ్వాలన్నారు. తనిఖీలను డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యరెడ్డి, రాఘవులు పర్యవేక్షించారు.


లాడ్జిలో రికార్డులు పరిశీలిస్తున్న టూటౌన్ సీఐ

యువకుల సేవలు ఆదర్శనీయం

నెల్లిమర్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో జరజాపుపేట యువకులు ఆదర్శనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు అన్నారు. నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం ఉపాధ్యక్షుడు నల్లి ఉమాశంకర్ స్మారకార్థం సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమాశంకర్ సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. తన వంతుగా ఆయన కుటుంబానికి రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్, మిమ్స్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఆరిపాక శ్రీనివాసరావు, లెక్చరర్ మాత రామకృష్ణ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న ఎమ్మెల్సీ

కేశవస్వామి భూముల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గల కేశవస్వామి ఆలయ భూముల గుర్తింపునకు దేవదాయ శాఖ అధికారులు చర్యలు మొదలుపెట్టారు. 'ఆ 47 ఎకరాలు ఏమైనట్టు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి దేవదాయశాఖ అధికారులు స్పందించారు. సన్యాసేశ్వరస్వామి ఆలయ ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో దేవదాయశాఖ సిబ్బంది కేశవస్వామికి భూములను గుర్తించే పనిలో పడ్డారు. ఆలయంలోని భూరికార్డులను ఈవోతో పాటు పంచాయతీ వీఆర్వో సుధీర్ పరిశీలించారు. గతంలో గుర్తించిన భూములతో పాటు ప్రస్తుతం కోర్టు కేసులో ఉన్న భూములను పరిశీలించారు. 47 ఎకరాలపై ప్రాథమిక దర్యాప్తు చేశారు. ఈ సందర్భంగా ఈవో ప్రసాద్ మట్లాడుతూ ఇక్కడి ఆలయానికి 141.90 ఎకరాల భూమి ఉందన్నారు. మొత్తం భూమిని సర్వే చేయాలని తహసీల్దార్‌కు దరఖాస్తు చేశామన్నారు. ఈ భూములకు సంబంధించిన 43 రికార్డులను రెవెన్యూ అధికారులకు అందజేశామన్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా పెద్దింటి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కణపాక యూత్ హాస్టల్‌లో ఆదివారం నేతాజీ మాజీ సైనికుల అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారులు బర్ల మహేశ్వరరావు, వై.సూరి.. పర్యవేక్షణ అధికారులుగా ఎస్ఎన్ రాజు, ఎన్‌వీ రాజు వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పెద్దింటి గుణకరరావు, గౌరవ అధ్యక్షుడిగా చలుమూరు రామారావు, ఉపాధ్యక్షుడిగా పి.మన్మథరావు, ప్రధాన కార్యదర్శిగా ఎల్.నారాయణరావు, సహాయ కార్యదర్శిగా గొర్లె శివకుమార్, కోశాధికారిగా ఎస్.ప్రకాశరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.గణపతి, కార్యవర్గ సభ్యులుగా కేవీజీఎస్ గుప్తా, వై.రవికుమార్, డి.శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాజీ సైనికుల అసోసియేషన్ నూతన కార్యవర్గం

అ'పూర్వ' కలయిక

గరివిడి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరాం హైస్కూల్‌కు చెందిన 1989-90 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

విభజించి పాలించడం దుర్మార్గం

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరిట విభజించి పాలించడం దుర్మార్గమని అంబేద్కర్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు బొంగా భానుమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవనంలో సీఎం చంద్రబాబు జన్మదినాన్ని ఎస్సీ రిజర్వేషన్ల వంచన దినంగా పాటిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 30న టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ఎస్సీ వర్గీకరణకు నాంది పలికారన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను తొలగించాలని కుట్రపూరిత ఆలోచనలో భాగంగా జీవో నెంబరు 86 ద్వారా రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వెంకటేష్ మధుసూదనరావు, వంశీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న భానుమూర్తి

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

గంట్యాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మదనాపురంలో ట్రాక్టరు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఆదివారం డ్రైవర్ రామారావు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక చంద్రయ్య చెరువులో నుంచి ట్రాక్టరుపై మట్టిని తీసుకుని వస్తున్న సమయంలో దారిలో గొయ్యిను తప్పించే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. మృతుడికి భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


రామారావు (ఫైల్)

లారీ, బైక్ ఢీ

● గిరిజనుడి మృతి.. మరొకరికి గాయాలు

సాలూరు రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లారీ, బైకు ఢీకొన్న ఘటనలో ఓ గిరిజనుడు మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఉన్నాయి. పాచిపెంట మండలం మంచాడవలసకు చెందిన శంబర బంగారయ్య(42) అనే గిరిజనుడు జీవనోపాధి కోసం కూలి పనులకు వెళ్తుంటాడు. ఈక్రమంలో ఆయన తమ బంధువు తెలుగు బంగారయ్యతో కలసి ఆదివారం సాలూరులో కూలి పనికి వెళ్లాడు. పని ముగించుకుని ఇద్దరూ మధ్యాహ్న భోజనానికి బైకుపై తమ గ్రామం బయలుదేరారు. వారి బైకు జీగిరాం గ్రామం దాటుతుండగా ఒడిశా వైపు నుంచి సాలూరు వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో తొలుత సాలూరు ఏరియా ఆసుపత్రికి, అనంతరం విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. విజయనగరం ఆసుపత్రిలో చేర్చిన కొద్దిసేపటికే బంగారయ్య మృతిచెందాడు. తెలుగు బంగారయ్య అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై సాలూరు రూరల్ ఎస్ఐ పి.నర్సింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, సింహాచలం, ఇద్దరు ఆడపిల్లలు దేవి, హసిని ఉన్నారు.


బంగారయ్య(ఫైల్)

కొడుకు అల్లరి భరించలేక..

● చీమల మందు తాగి మహిళ ఆత్మహత్య

వీరఘట్టం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ సెల్‌ఫోన్ కావాలని అల్లరి చేస్తున్న కొడుకు తీరు భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన వీరఘట్టం మండలం బొడ్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎస్ఐ జి.కళాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్లపాడు గ్రామానికి చెందిన రాజాన ఉషారాణి(44), రామకృష్ణలకు కుమారుడు కిరణ్, కూతురు రేష్మ ఉన్నారు. అయితే ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన కిరణ్.. తనకు సెల్‌ఫోన్ కావాలని ప్రతిరోజూ తన తల్లి ఉషారాణికి అడుగుతూ అల్లరి చేస్తూ ఉన్నాడు. తన దగ్గర డబ్బులు లేవని ఎంత చెప్పినా వినడం లేదు. కొడుకు అల్లరి భరించలేక మనస్తాపానికి గురైన ఉషారాణి ఈనెల 18వ తేదీన చీమల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే కుటుంబీకులు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

భోగాపురం, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలవలస సమీపంలో సైట్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకు వచ్చిన జార్ఖండ్‌కు చెందిన సురేష్‌బురియన్(46) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్‌కు చెందిన సురేష్ బురియన్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు చేయడానికి వారం కిందటే ఇక్కడకు వచ్చాడు. ఆరోగ్యం బాగోలేదు తిరిగి వెళ్లి పోతానని చెప్పి సూపర్‌వైజర్ దివ్యాన్ సుకుమార్ దగ్గర శనివారం సాయంత్రం రూ.వెయ్యి తీసుకున్నాడు. అయితే ఆదివారం ఉదయం చూసే సరికి లింగాలవలస సమీప సైట్‌లో విద్యుత్ స్తంభానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూపర్‌వైజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

తెట్టంగిలో చోరీ

● ఆరు తులాల బంగారం ● రూ.6 వేలు అపహరణ

గుర్ల, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోతి); మండలంలోని తెట్టంగిలో శనివారం చోరీ జరిగింది. జమ్ము పైడినాయుడు ఇంటిలో ఆరు తులాల బంగారం, రూ.6 వేల నగదు అపహరణకు గురైనట్టు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లి సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళాలు బద్దలు గొట్టారని, బీరువా తలుపులు తెరిచి ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీం పరిశీలించింది. ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

జనసేన నేతపై ఎస్సీ, ఎస్టీ కేసు


రాజాం రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజాంకు చెందిన జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పొగిరి సురేష్‌బాబుపై రాజాం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదయ్యింది. జనసైనికుడు చిత్తిరి నాగరాజు ఫిర్యాదు మేరకు రాజాం ఎస్.ఐ. రవికిరణ్ కేసు నమోదు చేశారు. ఈనెల 19న రాజాంలోని జనసేనకు చెందిన సురేష్‌బాబు కార్యాలయంలో పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో పనిచేసే సెంట్రల్ కమిటీ సభ్యులు రిక్షిత్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధినేత పవన్‌కల్యాణ్ సందేశంతో పాటు ట్యాగ్‌లు, బ్యాడ్జిలు పంపిణీ చేశారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఒమ్మి గ్రామానికి చెందిన నాగరాజు హాజరై తనతో పాటు జనసేన నాయకుడు యు.పి.రాజు ఇతరుల ఐడీ కార్డులు, ట్యాగ్‌లు ఇవ్వాలని కోరానని, ఇవ్వడానికి నిరాకరించి తనను కులం పేరుతో తిట్టి, దాడిచేశారని రాజాం పోలీసులకు నాగరాజు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు. ఇదే విషయాన్ని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి సురేష్‌కుమార్‌తో ఆదివారం రాత్రి ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా.. తాను ఎవరినీ కించపరచలేదని, కులం పేరుతో దూషించలేదని పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం జనసేన సెంట్రల్ కమిటీ సభ్యుల సమక్షంలో సీసీ కెమేరాల సాక్షిగా జరిగిందన్నారు. తన భార్య కృష్ణవేణికి రాజాం మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పదవి ఇవ్వడంతో తనపై ఎమ్మెల్యే కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మొత్తం వ్యవహారం మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు పవన్ కల్యాణ్‌కు ఆధారాలతో నివేదించానని వెల్లడించారు. పార్టీ కోసం కేసులకు భయపడేది లేదని సురేష్‌బాబు స్పష్టం చేశారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

వేపాడ/కొత్తవలస, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ తొంగర మహేశ్వరరావు శనివారం రాత్రి కొత్తవలసలోని తన నివాసంలో గుండెపోటుకు గురయ్యారు. విషయం గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించినప్పటికే మహేశ్వరరావు మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మహేశ్వరరావు మృతిపై ఎంపీడీవో సూర్యనారాయణ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జేఎస్‌ఎల్‌లో లాకౌట్‌ను ఎత్తివేయాలి

కొత్తవలస, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జేఎస్‌ఎల్ కార్మాగారం లాకౌట్‌ను ఎత్తివేయాలని సీపీఐ, సీపీఎం, వైసీపీ ట్రేడ్ యూనియన్, టీఎన్‌టీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం కార్మాగారం ఎదుట వివిధ కార్మిక సంఘాలు, పార్టీలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఉద్యోగులకు ఉపాధి భరోసా ఇవ్వమంటే లాకౌట్ ప్రకటిస్తారా అంటూ ప్రశ్నించారు. లాకౌట్ విధిస్తే కార్మికులకు ఉద్యోగ భద్రత ఎక్కడని నిలదీశారు. కార్మిక శాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లా అప్పలరాజు, డేగల అప్పరాజు, లగుడు వామాలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎస్సీ వర్గీకరణపై హర్షం

నెల్లిమర్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు లోనికి వచ్చిన సందర్భంగా జరజాపుపేటలో ఎంఆర్‌పీఎస్ సంఘం నాయకుడు మాత త్రినాథ్ హర్షం వ్యక్తం చేశారు. డా.అంబేద్కర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంఆర్‌సీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.

జాప్యమెందుకో?

(ఐదో పేజీ తరువాయి)

రైల్వే వ్యాగన్ డిపో త్వరలో ఏర్పాటు అవుతుందని, దీనివల్ల వచ్చే ఆదాయం తమ జోన్‌కు రావాలని పట్టుబడుతున్నారు. కొత్తవలస రైల్వే స్టేషన్ ఏ డివిజన్ పరిధిలో చేరుస్తారనే విషయం తేలే వరకు దక్షిణ కోస్తా జోన్ గజిట్ వచ్చే అవకాశాలు లేవంటున్నారు.

దక్షిణ కోస్తా జోన్‌లోనే ఉండాలి..

కొత్తవలస రైల్వేస్టేషన్‌ను దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు సంబంధించిన వాల్తేరు డివిజన్‌లోనే ఉండాలి. విశాఖపట్నానికి కూత వేటు దూరంలో ఉన్న కొత్తవలసను రాయగడ డివిజన్ చేర్చకూడదు. అలా జరిగితే ఏ సమస్య వచ్చినా భువనేశ్వర్ వెళ్లాలి. కొత్తవలసను వాల్తేరు డివిజన్‌లోనే ఉంచాలని రైల్వేశాఖ ఉన్నతాధికారులను ఇప్పటికే కోరాం. ఇందుకోసం స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కృషి చేయాలి.

-పి.రాజశేఖర్,
దక్షిణ కోస్తా ఓబీసీ రైల్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

పండగల నిర్వహణకు సహకరించండి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రజల ఇలవేల్పులు యర్రకంచమ్మ, ఇప్పలపోలమ్మల పండగల నిర్వహణకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. జగన్నాథపురం యర్రకంచమ్మ ఆలయంలో ఆయన ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ పండుగలను వచ్చే నెల 1వ, 2వ, 3వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ అమ్మవార్ల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేను అయ్యానని అన్నారు. పండగల నిర్వహణకు తన వంతు పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. అన్ని శాఖల అధికారుల సహాయంతో పండగను ఉత్సాహంగా నిర్వహిద్దామన్నారు. ఆలయ కమిటీల సభ్యుల సహకారం అవసరమన్నారు. అలాగే యర్రకంచమ్మ వనంగుడి అభివృద్ధితో పాటు రహదారి, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేయాలి

జియ్యమ్మవలస, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షా కాలానికి ముందే పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తి చేయాలని సీపీఎం కొమరాడ మండల కార్యదర్శి కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. వంతెన నిర్మించాల్సిన ప్రాంతాన్ని ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణం విషయంలో వైసీపీ పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలకులు అయినా వంతెన నిర్మాణం రానున్న వర్షాకాలంలోగా పూర్తి చేయాలని కోరారు. వంతెన లేకపోవడంతో కొమరాడ మండలంలోని 9 పంచాయతీలకు చెందిన 45 గ్రామాలు నాగావళి నది ఆవల ఉండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

మెస్ బిల్లులు విడుదల చేయండి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ వసతి గృహాలకు మెస్ బిల్లులను విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్లా సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. వసతిగృహాలకు మూడు నెలలుగా బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదని, దీంతో సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి వెంటనే వసతిగృహాలకు పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

స్వయం ఉపాధికి దరఖాస్తులు చేసుకోండి

గరుగుబిల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్థికంగా వెనుకబడిన షెడ్యూల్ కులానికి చెందిన వారు స్వయం ఉపాధికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలానికి 16 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన వారు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 10లోగా ఆన్‌లైన్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. చిన్న తరహా పథకాలకు సంబంధించి 10 యూనిట్లు, ఆటోలకు సంబంధించి 6 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలో లుంబూరు పోస్టర్ ఆవిష్కరణ

సీతంపేట రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలంలోని లుంబూరు గ్రామంలో ఈనెల 23వ తేదీన జనసేన పార్టీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ ఆవరణలో తూర్పుకాపు రాష్ట్ర డైరెక్టర్, జనసేన పార్టీ నాయకుడు గర్భాన సత్తిబాబు చలో లుంబూరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. లుంబూరు భారీ బహిరంగ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు మండంగి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు సవర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు నిఘా నేత్రాలు

పాచిపెంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో నేరాలు నియంత్రించేందుకు పోలీస్‌శాఖ నిఘా నేత్రాలు ఏర్పాటు చేసింది. లా అండ్ ఆర్డర్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని మోసూరులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలో నేరాలు జరిగేందుకు అవకాశం ఉండే ప్రాంతాల్లో, ప్రత్యేక కూడళ్ల వద్ద, పోలీసుల నిఘా అవసరమైనటువంటి ప్రదేశాల్లో దొంగతనాలు నివారించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఎస్ఐ కె.వెంకటసురేష్ తెలిపారు. పంచాయతీల నిధులతో పాటు దాతలు ఇచ్చిన విరాళాలతో మండలంలో పలు చోట్ల 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

ఆంగ్ల భాష ఉపాధ్యాయులకు శిక్షణ

బొబ్బిలి/రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లభాష ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీన స్థానిక ట్రిబుల్ ఎస్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు డెల్టా అధ్యక్షుడు ఎం.విజయమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్లతో ఆంగ్ల భాష బోధనలో ఉపాధ్యాయులకు క్లిష్టతరమైన 14 ఇంగ్లీష్ బోధనాంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో ప్రభుత్వ, యాజమాన్య, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు 9440744741 నెంబరుకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సను పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



బొబ్బిలి రూరల్: పెంట గ్రామంలో రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం

మక్కువ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా వాతావరణం మారడంతో దట్టమైన ఈదురు గాలులు వీచాయి. చెముడు రహదారి సమీపంలో కొబ్బరిచెట్టు నేలకొరిగి విద్యుత్ స్తంభంపై పడడంతో వైర్లు పూర్తిగా తెగిపోయాయి. నిత్యం జనాలు రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. విద్యుత్ సరఫరాకు చాలా సమయం అంతరాయం ఏర్పడింది.

● బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరాయపురం, పెంట గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలుల కారణంగా భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రంగరాయపురంలో ఓ గోడపై చెట్టు కూలింది. పెంట అలాగే గ్రామంలోని ఓ వీధిలో విద్యుత్ స్తంభం అడ్డంగా కూలింది. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి, విద్యుత్తును పునరుద్ధరించారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

● కేక్ కట్ చేసిన ఎమ్మెల్యేలు



భోగాపురం: భారీ కేక్‌ను కట్ చేస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, ఎంపీ కలిశెట్టి



డెంకాడ: చిన్నారులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, టీడీపీ నాయకుడు కంది చంద్రశేఖరరావు



ఎస్.కోటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

భోగాపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం రావాడలో ఘనంగా నిర్వహించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సమక్షంలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ 75 కేజీల కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కోరాడ తాతారావు, దాసరి అప్పలస్వామి, కర్రోతు రాజు పాల్గొన్నారు. ● విజయనగరం/డెంకాడ: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను డెంకాడ మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు వేర్వేరుగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు పల్లి భాస్కరరావు, టీడీపీ ఆర్గనైజింగ్ జిల్లా సెక్రటరీ పాణిరాజు ఉన్నారు. బంగార్రాజు నిర్వహించిన వేడుకల్లో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రాజు తదితరులున్నారు. ● శృంగవరపుకోట: స్థానిక దేవిబొమ్మ కూడలిలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకులను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. ఈసందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం 500 మంది పేదలకు వస్త్రాలను దానం చేశారు. మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, రాయవరపు చంద్రశేఖర్, కె.మల్లేశ్వరరావు, కాపుగంటి వాసు, పెదగాడి అప్పలరాజు, కిరణ్, వాకాడ బాలు తదితరులున్నారు. ● రాజాం: ఒమ్మి గ్రామంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొని, కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పొగిరి లెప్రసీ కేంద్రంలో రోగులు మధ్యాహ్న భోజనం అందించారు. నటరాజ కల్యాణ మండపంలో రెడ్‌క్రాస్ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఒమ్మి- నర్సిపురం బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కోండ్రు జగదీశ్, వంగా వెంకటరావు, కోళ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు. ● బొబ్బిలి/ రూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీనాయన ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి కోట దక్షిణ దేవిడి జంక్షన్‌లో ఏర్పాటుచేసిన అన్నదానంలో ఆయన పాల్గొని, వడ్డించారు. బొబ్బిలి మండలంలో పలుచోట్ల టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ● కురుపాం: కురుపాంలో నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ పాల్గొని, కేక్ కట్ చేశారు. స్థానిక ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తెలుగు యువత అధికారి ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, ట్రైకర్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఎంపీపీ జీవీ రమణమూర్తి పాల్గొన్నారు.



పార్వతీపురం: అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



రాజాం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



బొబ్బిలి: అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



కురుపాం: కేక్ కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేశ్ చంద్రదేవ్

వెల్లివిరిసిన ఆనందం

● డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై హర్షాతిరేకాలు

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేశారని అభ్యర్థులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

శుభ పరిణామం



గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించలేదు. ఇప్పుడు పోస్టులు పెంచుతూ మెగా డీఎస్సీ ప్రకటించడం శుభ పరిణామం. ఈ విద్యా సంవత్సరం నాటికి నియామక ప్రక్రియ పూర్తిచేయాలి. పారదర్శకంగా నియామక ప్రక్రియ చేపట్టాలి.

- బొమ్మినేని మౌనిక, డీఎస్సీ అభ్యర్థి, రాజాం

హర్షణీయం



కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీ ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం హర్షణీయం. అయితే పోస్టులు పెంచడంతో పాటు, డీఎస్సీ ప్రక్రియకు సమయం పెంచాల్సి ఉంది. 20వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే బాగుండేది.

- పైడిబాబు, విజయనగరం

వయో పరిమితి పెంపుతో ఎంతోమందికి అవకాశం



డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల హర్షణీయం. వయో పరిమితి 42ఏళ్ల నుంచి 44ఏళ్లకు పెంచడం ద్వారా ఎంతో మంది యువతకు ఇది ఒక మంచి అవకాశం ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మెటీరియల్ కూడా పంపిణీ చేశారు.

- షేక్ పీర్, గజపతినగరం

మాట నిలబెట్టుకున్నారు



ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. ఎక్కువ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రిపరేషన్‌కు గడువు మరింత పెంచాలని నిరుద్యోగులంతా కోరుకుంటున్నారు.

- చలుమూరి అప్పలనాయుడు, ఎస్.కోట

రెండేళ్లుగా ప్రిపేర్ అవుతున్నా



రెండేళ్లుగా డీఎస్సీ కోసం రాజాంలోని గ్రంథాలయంలో ప్రిపేర్ అవుతున్నాను. చాలా ఏళ్ల తర్వాత నోటిఫికేషన్ రావడం సంతోషంగా ఉంది. దాతలు సహకరించి గ్రంథాలయానికి డీఎస్సీ మెటీరియల్‌ను అందించాలని కోరుతున్నాం.

- లక్ష్మణరావు, ఏగిరెడ్డిపేట, రాజాం మండలం

నోటిఫికేషన్ చూడగానే ఆనందం కలిగింది



ఇంతకుముందు ఒకసారి డీఎస్సీకి ప్రయత్నించాను. కానీ అర్హత పొందలే కపోయాను. ఇప్పుడు ఈ నోటిఫికేషన్ చూడగానే ఆనందం కలిగింది. నేను బొబ్బిలి శాఖా గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నాను. ప్రిపరేషన్‌కు తక్కువ సమయం ఇవ్వడం కొంచెం బాధగా ఉంది.

- ఎ.మల్లేశ్వరి, సంగం వీధి, బొబ్బిలి పట్టణం

ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్నా



ఉపాధ్యాయ నియామకాల కోసం ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజున మెగా డీఎస్సీ ప్రకటించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- ఎస్.పద్మజ, కొండగుంపాం గ్రామం, నెల్లిమర్ల మండలం

గత ప్రభుత్వం పట్టించుకోలేదు



గతంలో ఏడాదికి రెండు సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దయ వల్ల నోటిఫికేషన్ విడుదల అవడం అనందంగా ఉంది. రెట్టింపు ఉత్సాహంతో ప్రిపేరు అవుతున్నాను. ప్రతిరోజూ మార్కెట్ యార్డ్‌కు వచ్చి చదువుతుంటాను.

- జె.వెంకటరమణ, జగన్నాథపురం, బొబ్బిలి మండలం

ఘనంగా పైడితల్లి విగ్రహ ప్రతిష్ఠ

రామభద్రపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆరికతోట గ్రామ మధ్య వీధిలో ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న ఆలయానికి భక్తుల విరాళాలతో గ్రామస్థులు శ్రమదానంతో అందంగా నిర్మించారు. ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దాడితల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

బొబ్బిలి/ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లిలోని దాడితల్లి అమ్మవారిని మజ్జిగౌరి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఉన్నారు.

కనబడుట లేదు



పేరు: సోము కామేష్
వయస్సు: 35 సంవత్సరాలు
కలర్ : ఎరుపు
ఎత్తు : 5 అడుగుల 5 అంగుళాలు
ధరించిన దుస్తులు :గ్రీన్ బ్లాక్ కలర్ చెక్స్ షర్ట్, సిమెంట్ కలర్ జీన్‌ఫ్యాంట్
మొబైల్: కీప్యాడ్ మొబైల్, 9959926344
గుర్తింపు: ఎడమకాలు కొంచెం వంగి ఉంటుంది. తలపై చిన్న వెంట్రుకలతో పాటు ఐబ్రోస్‌పై అడ్డంగా ఒక అంగుళం స్క్రాచ్ ఉంటుంది.
సంప్రదించాల్సిన నెంబర్లు: 8885407104, 8008157525, 9398776676

ఆనందమానందమాయె

(ఐదో పేజీ తరువాయి)

సాధారణ ఎన్నికల ముందు గత ఏడాది ఫిబ్రవరి 12న ప్రకటన జారీ చేసింది. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో టెట్ పరీక్ష వాయిదా వేశారు. జిల్లాలో 284 పోస్టుల భర్తీకి ప్రకటించిన నోటిఫికేషన్ కూడా నిలిచిపోయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎంగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టాక మెగా డీఎస్సీ ప్రకటనకు సంబంధించిన ఫైల్‌పై రెండో సంతకం చేశారు. ఆ తర్వాత గత ఏడాది అక్టోబరు 3 నుంచి 21 వరకూ టెట్ నిర్వహించి ఫలితాలు కూడా విడుదల చేసిన సంగతి తెలిసిందే. టెట్‌కు జిల్లాలో 22,890 మంది దరఖాస్తు చేసుకోగా 20,354 మంది పరీక్ష రాశారు. 2534 మంది పరీక్ష దూరంగా ఉండిపోయారు. ఇందులో 50 శాతం మంది అభ్యర్థులు క్వాలీపై అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. టెట్ పూర్తయ్యాక డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. అయితే ఎస్సీ వర్గీకరణ కారణంగా జాప్యం జరిగింది. వర్గీకరణకు సంబంధించిన ప్రక్రియను వేగంగా పూర్తి చేసిన ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

● ఇప్పటికే చాలా మంది నిరుద్యోగులు వివిధ కోచింగ్ సెంటర్లలో చేరి శిక్షణ తీసుకుంటున్నారు. గ్రూపులుగా ఏర్పడి చదువుకుంటున్నారు. ఇంటి వద్ద చదువుకొనేందుకు అవకాశం లేని వారు గ్రంథాలయాల బాట పడుతున్నారు. అభ్యర్థుల అర్హత వయసు 42 నుంచి 44 సంవత్సరాలకు పెంచారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 49 సంవత్స రాల వరకూ అర్హులే. కాగా కొంతమంది అభ్యర్థులు పరీక్షకు ఇచ్చిన గడువును పెంచాలని కోరుతున్నారు.

15 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ..

డీఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఆదివారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మే 20న ఆన్‌లైన్‌లో మాక్‌టెస్టు నిర్వహి స్తోంది. మే 30 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసు కోవచ్చు. జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్ష నిర్వహిస్తారు. తరువాత ఫైనల్ కీ విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరించి మెరిట్ లిస్టు విడుదల చేస్తారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

ఏసుక్రీస్తు పునరుత్థాన(ఈస్టర్) వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు, పాదర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)



పార్వతీపురంటౌన్: జోజప్ప దేవాలయంలో..



పాలకొండ: చర్చిలో ప్రార్థనలు



రామభద్రపురం: ఆరికతోట ఏడీఎం బాప్టిస్టు చర్చిలో



మెరకముడిదాంలో..



బొబ్బిలి: సీబీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో